హైదరాబాద్ వార్త

# రూ.లక్షల్లో ఫీజులు..ఇష్టారాజ్యంగా నిర్ణయాలు

**తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలు**

**ఒక్కో విద్యార్థికి ఏడాదికి రెండున్నర లక్షల వరకు వసూళ్లు**

**పట్టించుకోని ఇంటర్మీడియట్ బోర్డు**

**హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త :** జనగాం జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ఓ ప్రైవేటు స్కూల్‌లో 10వ తరగతిలో మంచి ర్యాంకుతో ఉత్తీర్ణుడైన కుశలు అనే విద్యార్థిని ఇంటర్మీడియట్‌లో చేర్చేందుకు విద్యార్థి తల్లిదండ్రులు మాదాపూర్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీని (రెసిడెన్షియల్) సంప్రదించారు. ఏడాదికి రూ.2.50లక్షల ఫీజు అని చెప్పడంతో నోరెళ్లబెట్టాడు. చేసేదేంలేక సమీపంలోని మరో కార్పొరేటర్ యాజమాన్యానికి చెందిన కాలేజీలో సంప్రదించారు. అక్కడ ఏడాదికి ఫస్ట్‌ఇయర్‌కు రూ.2.40లక్షలు, సెకండియర్‌కు రూ.2.60లక్షలు..ఈ ఫీజుకు ఒకే అంటే సీటు ఇస్తామని చెప్పడంతో అవాక్కయ్యారు...ఇది నగరంలో కార్పొరేట్, ప్రముఖ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్డగోలుగా వసూలు చేస్తున్న ఫీజుల బాగోతం. లక్షల కొద్దీ ఫీజులు కట్టడం కోసం సతమతం అవుతున్న తల్లిదండ్రుల ఆందోళన.. పదో తరగతి పూర్తి అయిన విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం నగరానికి పరుగెడుతున్నారు. అయితే కార్పొరేట్ కాలేజీల్లో సీట్లు అయిపోతున్నాయంటూ తల్లిదండ్రులను ఆందోళనలోకి నెట్టేసి అధిక ఫీజులను దండుకుంటున్నాయి. ఫలానా కాలేజీలోని, ఫలానా బ్రాంచీలో ఇంటర్మీడియట్ చదివిస్తే జెఇఇలో, ఎంసెట్‌లో మంచి ర్యాంకులు వస్తాయని..తద్వారా బిటెక్ సీటు మంచి కాలేజీలో వస్తుందన్న ఆశతో తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్, ప్రముఖ ప్రైవేటు కాలేజీల్లో చేర్పేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ బోర్డు నిర్ణీత ఫీజుల విధానాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి.కార్పొరేట్ కాలేజీలు హాస్టల్ వసతి కలుపుకొని రూ.1.60లక్షల నుంచి రూ.2.60లక్షల వరకు తీసుకుంటున్నాయి. నోటికి వచ్చిందే ఫీజు అన్నట్లుగా అడ్డగోలుగా నిర్ణయించి రూ.10,500లు అడ్వాన్స్‌గా తీసుకొని రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి. ఆయా కాలేజీల్లో చదివిస్తే తమ పిల్లలకు మంచి చదువు వస్తుందని, మంచి ర్యాంకు వస్తుందన్న ఆశలతో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ అడిగినంత ఫీజు చెల్లిస్తున్నారు.

మరోవైపు నగరానికి చెందిన కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయగా, మరికొన్ని ప్రైవేటు కాలేజీ అడ్మిషన్ల కోసం విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్లుచేసి బంగారు భవిష్యత్తు అందిస్తామంటూ ప్రలోభాలకు గురి చేస్తున్నాయి. ఒక్కసారి కాలేజీని సందర్శించాలంటూ పదేపదే ఫోన్లు చేయించడం మామూలుగా మారింది.ఎంసెట్, జెఇఇ, నీట్ విద్యార్థుల కోసం కళాశాలలు ఏజెంట్లను కూడా నియమించుకుని వారి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ఫోన్లలో సంప్రదించడం, కలవడం, అడ్మిషన్లు బుక్ చేసుకోవడం లాంటి కార్యకలాపాలు ప్రారంభించాయి. తమ విద్యాసంస్థలో ముందుగా చేరితే ఫీజులో రాయితీ ఇస్తామంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి.

అయితే ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం వరుసగా వస్తున్న ఫోన్లు, ఎస్ఎంఎస్‌లతో తల్లిదండ్రులు విస్తుపోతు న్నారు. అయితే ప్రతిఏటా నగరంలో వేల సంఖ్యలో విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలో చదువుకుంటుండగా.. మళ్లీ తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ కళాశాలల్లో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కసారి కాలేజీని సందర్శించండంటూ పదేపదే టెలికాలర్స్‌ద్వారా ఫోన్లు చేయించడం మామూలుగా మారింది. 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నోటికేషన్ విడుదల కాకుండానే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించవద్దని ఇటీవల ఇంటర్మీడియట్ బోర్డు హెచ్చరికలు జారీ చేసినా వాటిని పట్టించుకునేవారు లేకుండా పోవడం గమనార్హం.దీంతో తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలను చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



శంకరరావుకు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందించిన దృశ్యం

## పద్మశ్రీ నందమూరి తారకరామారావు శతజయంతి

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** రాగరాగిణి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా ప్రముఖ నాటక, టీవీ నటులు కోట శంకరరావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా పద్మరాజు హాజరుకాగా సభకు, సువర్చల ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత, పూర్వ దక్షిణమధ్యరైల్వే జనరల్‌మేనేజర్ సి.రామకృష్ణ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా కళాభిమాని వి.శైలజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'జగదేకవీరుని జయగీతాలు' పేరుతో ఎన్టీఆర్ నటించిన చిత్రగీత విభావరిలో గాయనీ గాయకులు ఎం.వి.రమణకుమారి నేతృత్వంలో శశికాంతి, దినకరరావు, విజయకుమార్, అంబాదాస్ తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## విజయవంతమైన 10 రోజుల జాతీయస్థాయి థియేటర్ టెక్నికల్ వర్క్‌షాప్

**నాంపల్లి, మే 22 ప్రభాతవార్త :** డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 10రోజులపాటు జరిగిన జాతీయస్థాయి థియేటర్ టెక్నికల్ వర్క్‌షాప్ 12 ప్రారంభమై 22 నేటితో విజయవంతంగా ముగిసాయి. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టురమేష్ సభాధ్యక్షతన జరిగిన ఈ ముగింపు సమావేశానికి బరోడా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ దర్శన్ సతీష్‌చంద్ర పురోహిత్, గౌరవ అతిథులుగా ఆచార్య డిఎస్ఎన్.మూర్తి, ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు, డా. ఎల్.వి.భూషణ్, డా. రాజు ఆంథోని, డా. బిహెచ్.పద్మప్రియ, మల్లాది గోపాలకృష్ణ, బిహెచ్.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పాఠ్యాంశంలో భాగంగా ఇలాంటి మెళకువలు ఎన్నో తెలుసుకున్నప్పటికీ పదిరోజుల జాతీయస్థాయి థియేటర్ టెక్నికల్ వర్క్‌షాప్‌లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన థియేటర్ టెక్నికల్ సబ్జెక్టులపై విద్యార్థులతోపాటు వర్క్‌షాప్‌లో ఉన్న పూర్వ విద్యార్థులకు, ఇతర అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడిందని విద్యార్థులు ఆనందపడ్డారన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు మరెన్నో చేయడానికి తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళలశాఖ ఎప్పుడూ ముందుంటుందని, మరెన్నో ఆలోచనలతో ముందుకెళుతుందని సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యాలయందరికీ మెమెంటోలు ప్రదానం చేశారు.

# 31న సూపర్‌స్టార్ కృష్ణ ఫిల్మ్ అవార్డుల ప్రదానం

**నాంపల్లి, మే 22 ప్రభాతవార్త :** వాసవి గ్రూప్ సౌజన్యంతో కళాదర్బార్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలుగు చలనచిత్రం రంగంలో ఎన్నో మైలురాళ్లను సాధించిన ప్రముఖ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ 80వ జయంతిని వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 31 బుధవారం సాయంత్రం 5గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించే కృష్ణ 80 వసంతాల జయంతోత్సవంలో ప్రముఖ తెలుగు సీనియర్ నటీనటులకు సూపర్‌స్టార్ కృష్ణ ఫిల్మ్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆరుబయలు కళావేదికలో జరిగిన మీడియా సమావేశంలో తెలియజేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డులు స్వీకరించనున్న నటీనటులలో చంద్రమోహన్, బ్రహ్మానందం, భానుచందర్, జయప్రద, ప్రభ, కవిత, ఎస్.వి.కృష్ణారెడ్డిలతో పాటు సీనియర్ జర్నలిస్టు ఉప్పలూరి వినాయరావులు ఉన్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ నటుడు సుధీర్ బాబు, విశిష్టఅతిథులుగా తమ్మారెడ్డి భరద్వాజ, కె.ప్రసాద్, డా. ఏ.నరేందర్ తదితరులు పాల్గొంటారని, సభకుముందు వర్ధమాన గాయకులచే ఆణిముత్యాల్లాంటి పాటలతో సినీసంగీత విభావరి ఉంటుందని, అధికసంఖ్యలో కృష్ణ అభిమానులు, సినీప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని ఆస్వాదించి విజయవంతం చేయాలని రంగారావు కోరారు. ఈ సందర్భంగా రంగారావు సురేష్, త్రినాథరావు, హైమవతి, సుధాకర్, చంద్రబాబు తదితరులతో కలిసి కార్యక్రమ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు.



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న రంగారావు, సురేష్, త్రినాథరావు తదితరులు



చర్లపల్లి పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ డి ఎస్ చౌహాన్

### ప్రజలకు మెరుగైన సేవల కోసమే

## అదనపు పోలీస్ స్టేషన్లు.. సిపి చౌహాన్

**కుషాయిగూడ, మే 22, ప్రభాతవార్త :** ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అదనపు పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్ చౌహాన్ పేర్కొన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ కుషాయిగూడ ఏసీబీ పరిధిలోని చర్లపల్లి లో ఏర్పాటు చేయనున్న చర్లపల్లి నూతన పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అదనపు సేవలు అందించడానికి చర్లపల్లి పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపి జానకి ఐపిఎస్, కుషాయిగూడ ఏసిపి వై వెంకట్ రెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పారిశ్రామికవేత్తలు లయన్స్ క్లబ్ సభ్యులు మంద సురేష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉపేందర్ యాదవ్, సాయికుమార్, ప్రసాద్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేటలో యువకుడి ఆత్మహత్య

**బేగంపేట మే 22,ప్రభాతవార్త :** బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌గదిలో యువకుడు చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు, స్థానికులు కథనం ప్రకారం...రామంతాపూర్ గోఖలేనగర్‌కు చెందిన టి. సాంబరాజు(22) మహంకాళీ పరిధిలోని ఓ బంగారుషాపులో పని చేస్తున్నాడన్నారు. ఆదివారం ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బయలుదేరి బయటకు వచ్చి బేగంపేటలోని ఓ హోటల్‌కు 12 గంటల సమయంలో గదిని అద్దెకు తీసుకున్నాడు. వెంట తెచ్చుకున్న బ్యాగులో నుంచి చున్నీని తీసుకుని ఫ్యాన్‌కు కట్టి దానితో మెడకు ఉరివేసుకున్నాడు.ఈ సమయంలోనే అక్కడి నుంచి మిత్రులకు వీడియో కాల్ చేసాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్న దృశ్యాన్ని వీడియో కాల్ ద్వారా వారికి చూపించాడు. తాను ఇక బతకనని, వారితో మాట్లాడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్రమత్తమైన స్నేహితులు ఫోన్‌లో ఉన్న లోకేషన్ ద్వారా బేగంపేటలోని హోటల్‌కు చేరుకుని సాంబరాజు ఉన్న గది తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే అతను ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు వచ్చిన వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందాడని డాక్టర్లు చెప్పడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మృతుని సోదరుడుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.జయచంద్రా తెలిపారు. యువకుని ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం ఆధారాలను సేకరించారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక పోలీస్ వ్యవస్థ ఏర్పాటు

**సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర**

**పేట్‌బషీరాబాద్, మే 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మహిళలు, చిన్నారులకు ప్రత్యేక భద్రతను కల్పించేందుకు సీఎం కేసీఆర్ సారథ్యంలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టామని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మేడ్చల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్లపరిధికి సంబంధించిన సీడీఈడబ్ల్యూ కేంద్రంతోపాటు ఏవి ఆడియో విజువల్స్ వాహనాలను సీపీ స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎప్పుడైన, ఎక్కడైనా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా నిమిషాల వ్యవధిలో వారి రక్షణ కోసం నిరంతరం పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. సైబరాబాద్ పరిధిలో సేఫ్ సిటీ ప్రాజెక్ట్ సిడిఈడబ్ల్యూలో భాగంగా నూతనంగా ఏడు ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ముందుగా పేట్‌బషీరాబాద్, అల్వాల్, జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ల ఆవరణలో ఈ కేంద్రాలను ప్రారంభిచామన్నారు. ఈ కేంద్రాల్లో డొమెస్టిక్ వాయిలెన్స్ కేసులు, ఫ్యామిలీకి సంబంధించిన కేసులు సత్వరమే పరిష్కరించేందుకు వారికి తమ సిబ్బందిచే కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ కేంద్రాలు ప్రారంభం కాకముందే అల్వాల్ పరిధిలో 183, పేట్‌బషీరాబాద్ పరిధిలో 157 కేసులకు పరిష్కార మార్గాలు చూపామన్నారు.



సీడీఈడబ్ల్యూ కేంద్రాన్ని ప్రారంభించిన సీపీ రవీంద్ర

**మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయాన్ని సందర్శించిన సైబరాబాద్ సీపీ**

పేట్‌బషీరాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ట్రాఫిక్ డీసీపి కార్యాలయం పనులను పరిశీలించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి ట్రాఫిక్, సివిల్ పోలీసులకు ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. జాతీయ రహదారులపై జరగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మేడ్చల్ జోన్ పరిధిలో జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా వాహనదారులకు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ డి.వి.శ్రీనివాసరావు, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు, సీఐ ప్రశాంత్, మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్, పేట్‌బషీరాబాద్ సివిల్ ఏసీపీలు వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, ధనలక్ష్మి, అల్వాల్ ట్రాఫిక్ సీఐ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెల్‌ఫోన్ డ్రైవింగ్..పొంచివున్న ప్రమాదాలు





**హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త :** రయ్యిమంటూ దూసుకెళుతున్న బైక్ వీరులు వేగంగా వెళుతున్న కారు డ్రైవర్లు గమ్యస్థానాల వైపే వెళ్తున్నా రహదారుల్లో ఒకవైపే చూస్తున్నారు. ప్రయాణంలో సెల్‌ఫోన్లను వదలడం లేదు. మెడను ఒకవైపు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వెళుతున్నారు. కారు డ్రైవర్‌లు డ్యాష్ బోర్డుకు సెల్‌ఫోన్‌ను అనుసంధానంచేసి మాట్లాడుకుంటూ వేగంగా వాహనాలు నడుపుతున్నారు. ట్రాఫిక్ పెరిగినప్పుడు పక్కన వెనుక వైపు వాహనాలు వస్తున్నప్పుడు గమనించకుండా ప్రమాదాలు చేస్తున్నారని రవాణాశాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. రహదారి భద్రతో భాగంగా నగరంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాహనదారులను పోలీసులు పరిశీలించారు. ద్విచక్ర వాహనదారుల్లో 90శాతం మంది శిరస్త్రాణంలో సెల్‌ఫోన్ ఉంచుకొని ఒక చేతితో హ్యాండిల్ పట్టుకొని మాట్లాడుకుంటూ వెళ్తున్నారని గుర్తించారు. వీటిపై ట్రాఫిక్ పోలీసులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు.

వాహనాలు నిడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడటం చాలా ప్రమాదకరమని వాహనదారుల డ్రైవింగ్ తీరుతెన్నులను గమనించిన రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. బైక్‌లపై వెళ్ళేవారు. ఫోన్ రాగానే ముందూ వెనకా చూసుకోకుండా మాట్లాడుతున్నారని గుర్తించారు. కొందరు ఒక్కసారిగా వాహనం ఆపడంతో వెనుక వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి.ఇలా ఫోన్‌లు మాట్లాడుతూ బైక్‌లపై వెళ్తున్న వారు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజాగుట్ట ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నారు.

నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో కొద్ది నెలల నుంచి మైనర్‌లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలు చేస్తున్నారు.మైనర్‌లతో జరిగిన ప్రమాదాల వివరాలను సేకరించడంతో పాటు పోలీసులు తెలిపిన సమాచార ఆధారంగా మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన వారి డ్రైవిగ్ లైసెన్స్‌లను తాత్కాలికంగా రద్దుచేస్తున్నారు. సెల్‌ఫోన్లతో మాట్లాడుతూ వాహనాన్ని నడపడం నేరమంటూ వాహనదారులకు పోలీసులు ఇప్పటికే అవగాహన కల్పిస్తుండగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని రవాణాశాఖ అధికారులు నిర్ణయించారు. స్వచ్ఛంధ సంస్థల ప్రతి నిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులను ఆహ్వానించాలని అనుకుంటున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ చిక్కిన వారితో ఈ సదస్సులో మాట్లాడించనున్నారు. సెల్‌ఫోన్‌తో మాట్లాడితే ఎలాటి దుష్పరిణావలను ఎదుర్కోవాల్సి వస్తుంది తలను సురక్షితంగా ఎలా కాపాడు కోవాలన్న అంశాలే కీలమకమని వివరించను న్నారు. యువత ప్రచారంలో భాగస్వాములు అయ్యేలా చేయనున్నారు.

# ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

**కంటోన్మెంట్, మే 22 ప్రభాతవార్త:** ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అలాగేలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రంలో బస్తీ దవాఖానాలను నెలకొల్పిందని ఆయన చెప్పారు. సోమవారం కంటోన్మెంట్ 6వ వార్డు నందమూరి నగర్‌లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను కార్పొరేషన్ల చైర్మన్లు డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె క్రిషాంక్, గజ్జెల నాగేశ్, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్యనందిత, మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం తలసాని మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య విషయంలో సిఎం కేసిఆర్ వినూత్నరీతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి విజయ వంతంగా అమలు చేసుస్తున్నారన్నారు. కంటివెలుగు, కేసిఆర్ కిట్టు ప్రతి ఒక్కరికి ఉపయోగపడు తుందని తెలిపారు. బస్తీ దావఖానలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం అందిస్తున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైదాధికారి డాక్టర్ వెంకటి, ఎస్.శ్రీగణేష్, బోర్డు మాజీ సభ్యులు నళినికిరణ్, ప్యారసాని ప్రభాకర్, లోకనాథం, ముప్పిడి మధుకర్, అరుణ్‌యాదవ్, భాస్కర్, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నందమూరి నగర్‌లో బస్తీ దావఖానను ప్రారంబిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్



జలమండలిమేనేజర్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బిజేపీ నేతలు

## తాగునీటి సమస్య పరిష్కరించాలని జలమండలి కార్యాలయం ఎదుట బిజెపి ధర్నా

**తార్నాక, మే 22 ప్రభాతవార్త:** మంచి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తార్నాక డివిజన్ బిజేపీ అద్యక్షులు రామువర్మ ఆద్వర్యంలో శాంతినగర్ జలమండలి కార్యాలయం ముందు నాయకులు ధర్నానిర్వహించారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మేనే జర్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. లాలాపేట్ గణేష్‌నగర్ లో మంచినీరు లోప్రెషర్ సరఫరా అవుతుందని, న్యూసత్యనగర్‌లో కలుషిత నీరు, మంచినీరులో ప్రెషర్ వస్తుందన్నారు. ఆర్యనగర్, వినోభానగర్, సత్యనగర్, ఇంద్రానగర్, లక్ష్మినగర్ తదితర ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుందని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని నాయకులు వినతిపత్రంలో పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, కనకంట్ల హరి, ప్రభుగుప్త, శారదా మల్లేష్, పోచయ్య యాదవ్, బండశివారెడ్డి, శ్రీనివాస్ చారి, అనిత, అనూష, కృష్ణమూర్తి, ఎస్సీ మోర్చ కార్యదర్శి జమ్మికుంట వేణు, ఎద్దు సుబ్బారావు, వెంకటేష్ గౌడ్, కృష్ణ, గోవర్ధన్, నాగేందర్, సింహాచలం, ఓబీసీ తార్నాక డివిజన్ అధ్యక్షులు ప్రమోద్, ఉపేందర్ యాదవ్, కర్ణాకర్, గోపి, సాయి పాల్గొన్నారు.

## ఒయూలో జీవవైవిధ్య పరిరక్షణ అధ్యయన కేంద్రం ప్రారంభం



నూతన భవవాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్

**తార్నాక, మే 22 ప్రభాతవార్త:** జీవ వైవిధ్య పరిరక్షణ అధ్యయనం కోసం ఓ.యూలో నూతనంగా నిర్మించిన భవనాన్ని సోమవారం రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మినారాయణతో కలిసి వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ ప్రారంభిం చారు. కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ పరిధిలోని రూసా ప్రాజెక్టులో భాగంగా ఓ.యూలో ఈ కేంద్రానికి శాస్వత భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యంపై తెలంగాణ వ్యాప్తంగా అద్యయనం చేసి పూర్తి సమాచారాన్ని నిక్షిప్తంచేసేందుకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలతో ఓయూకు పరస్పర అవగాహనా ఒప్పందాలు ఉన్నందున ఆయావర్సిటీల అధ్యాపకులు జీవవైవిధ్యంపై పరిశోశనలు చేసేందుకు ఇక్కడకు వస్తారన్నారు. ప్రొ.లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఆక్సిజన్ పార్కు ఏర్పాటుతో సహా క్యాంపస్‌లో జీవవైవిధ్యాన్ని మెరుగుపర్చడానికి ఒయూ కృషిచేస్తుందన్నారు. జీవ వైవిధ్యానికి సంబంధించిన పూర్తి శాస్త్రీయ సమాచారాన్ని డేటాబేస్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు సెంటర్ సంచాలకులు ప్రొ.సి.శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శ్రీరాం వెంకటేష్, ప్రొ.బి. వీరయ్య, ప్రొ.భీమా, అధ్యాపకులు బి.రాజేంద్రనాయక్, ప్రొ.ప్యాట్రిక్, పి.రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం





**హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త :** నగరంలో సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. దీంతో వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ఎండాకాల పరిస్థితుల నుంచి స్థానికులకు కొంత ఉపశమనం లభించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచన మేరకు రాబోయే రెండు రోజులు నగరంలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాగా..పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. బోడుప్పల్, అంబర్‌పేట, తార్నాక, నాచారం, కుషాయిగూడ, నేరెడ్‌మెట్ కుత్బుల్లాపూర్, కొండాపూర్, మాదాపూర్, హైటెక్‌సిటీ, షేక్‌పేట, గచ్చిబౌలి, ఖాజాగూడ, రాయదుర్గం, యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారా హిల్స్, జూబ్లిహిల్స్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, కొంపల్లి, వనస్థలిపురం,హయత్‌నగర్, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురిసింది. పలుచోట్ల రోడ్లపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



మహారాణా ప్రతాప్ జయంతి ఉత్సవంలో పాల్గొన్న బిఆర్ఎస్ నేతలు

## ఘనంగా మహా రాణాప్రతాప్ జయంతి ఉత్సవాలు

**గోషామహల్, మే 22 ప్రభాతవార్త:** మహా రాణాప్రతాప్ జాగృతి మంచ్ ఆధ్వర్యంలో మహా రాణాప్రతాప్ 483 జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రామ్‌నాథ్ ఆశ్రమం సమీపంలో ఉన్న మహా రాణాప్రతాప్ విగ్రహానికి గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్ వ్యాస్(బిలాల్), గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారిని శాలువాకప్పి సన్మానించారు.కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షులు ఠాకూర్ సురేందర్‌సింగ్, తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు గుప్త, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, కె.డి.దినేష్ పాల్గొన్నారు.

## ఇంటర్ నుంచి పిజి వరకు ఉచిత విద్య

**అఫ్జల్‌గంజ్, మే 22 ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ, పిజి విద్యను గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తామని బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఉచితంగా ఇంటర్, డిగ్రీతోపాటు పిజి విద్యను అందించే ప్రక్రియ మొదలుపెట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా రెండవ ధఫా ధరఖాస్తు ఫారాలను అందచేయడం జరిగిందని చెప్పారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : శ్రీగణేష్



పిట్టల బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్ఎస్ నేత శ్రీగణేష్

**కంటోన్మెంట్, మే 22 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని బిఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సోమవారం కంటోన్మెంట్ 4వ వార్డులోని సయ్యద్ జలాల్ గార్డెన్, శివా అరుణ్‌కాలనీ, పిట్టల బస్తీ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడంతో పాటు సంవత్సరాల తరబడి స్థానికంగా నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ధర్జీ, రాణి, సంగీత, అనిత, గౌతమి, జోసెఫ్, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో ప్రజాసమస్యలు పరిష్కరించాలి



కంటోన్మెంట్ సిఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

**కంటోన్మెంట్, మే 22 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.బి.దేవేందర్ (దేవుడు), సోమవారం బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుమలగిరిలో డంపింగ్ యార్డును ఎత్తివేయాలని, బొల్లారం ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు అందించాలని, ఆర్మీ ఏరియాలోని హన్‌మాన్ టెంపుల్‌కు వెళ్లే దారిని ఓపెన్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని సిఈఓ దృష్టికి తెచ్చారు. అందుకు అయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## క్రీడాకారులకు అన్నదానం

**కంటోన్మెంట్, మే 22 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ జింఖానా మైదానంలో హైదరాబాద్ జిల్లా క్రీడాకారులకు సిఎం కప్ 2023 క్రీడలను సోమవారం మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో 1500 మంది క్రీడాకారులకు అన్నదానం చేశారు.

## మౌలిక సదుపాయల కల్పనే లక్ష్యం: కార్పొరేటర్



అభివృద్ధి పనులు ప్రారంభోత్సవంలో కార్పొరేటర్

**అల్వాల్, మే 22 ప్రభాతవార్త:** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా కల్పిస్తున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని తుర్కపల్లిలో అంతర్గత రోడ్లుపనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహాయ సహకారాలతో అభివృద్ధి సాగుతోందన్నారు. తర్కుపల్లి వాసులు సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తు న్నామని చెప్పారు. కార్యక్రమంలో ఇఇ రాజు, డిఇ మహేష్, ఎఇ రవళి బిఆర్ఎస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం, విష్ణు, శోభన్, బాల్‌రెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయసాధనకు కృషిచేయాలి

### దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** భారతరత్న బి.ఆర్.అంబేద్కర్ అశయ సాధనకోసం కృషి చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. అగ్రకుల దోపిడీ రాజకీయ పార్టీలైన బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించకపోతే బహుజనులకు భవిష్యత్తు లేదని హెచ్చరించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఎస్.రాంచందర్‌ను పార్టీ పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్‌గా నియమించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాధికార సాధన ద్వారానే సామాజిక న్యాయం, రక్షణ, విముక్తి లభిస్తుందని చెప్పారు. రాంచందర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో దళిత బహుజన పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని చెప్పారు. అంబేద్కర్ సందేశ యాత్రలో భాగంగా రాజ్యాధికార చైతన్య ర్యాలీని జూన్ 24న పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు సి.హెచ్.కరుణాకర్, మంచిర్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు దాసరి రవికుమార్, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రాంచందర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

# ఓలా, ఉబర్, రాపిడో సంస్థలను నిషేధించాలి



మాట్లాడుతున్న రాజు

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తూ వారి జీవితాలను రోడ్డున పడేస్తున్న ఓలా, ఉబర్, రాపిడో సంస్థలను నిషేదించాలని తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు బైరగోని రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎఐటియుసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఓలా, ఉబర్ వైట్ నంబర్‌ప్లేట్ల వాహనాలను ఎయిర్‌పోర్ట్‌లోకి రానీయకుండా ఓలా, ఉబర్ బౌన్సర్లు దాడులు చేస్తున్నారని ఆరోపించారు.రోడ్ ట్యాక్స్‌లేని వైట్‌ప్లేట్ల వాహనాలను టాక్సీలుగా నడపడానికి రాష్ట్ర ప్రభుత్వం, జీఎంఆర్ సంస్థ ఏలా అనుమతి ఇస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్లో నంబర్ ప్లేట్ల ట్యాక్సీ వాహనాలను ఎయిర్‌పోర్ట్‌లోకి అనుమతించరాదని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర మంత్రి కెటిఆర్ దీనిపై స్పందించి ఓలా, ఉబర్ సంస్థలతో చర్చించి ఈ కమిషన్ దోపిడీ నుంచి రక్షించాలని కోరారు. అలాగే పెరిగిన డిజీల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు కొంరెల్లి బాబు, ఎస్.కె.లతీఫ్ ఖాన్, జంగయ్య, భాషా, అమృతం పాల్గొన్నారు.



చిందు హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గం గణపతి, స్వామి, సమ్మయ్య, రమేష్, ముకుందం తదితరులతో కళాకారులు

## చిందుయక్షగాన కళాకారుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి

**నాంపల్లి, మే 22 ప్రభాతవార్త :** నానాటికీ అంతరించిపోతున్న చిందు యక్షగాన కళ, కళాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతుందని చిందు హక్కుల పోరాట సమితి ఈ రోజు జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి సాంస్కృతిక కళాకారుల సమావేశంలో పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిందు హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గజవెల్లి గణపతి పాల్గొని పోరాట సమితి రాష్ట్రస్థాయి నూతన కమిటీని ప్రకటించారు. నూతన అధ్యక్షుడుగా యాదాద్రి జిల్లాకు చెందిన గడ్డం స్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా జనగాం జిల్లా చెందిన ప్రముఖ యక్షగాన కళాకారులు గడ్డం సమ్మయ్య, హిమగిరి, ప్రధాన కార్యదర్శిగా సిద్ధిపేట జిల్లాకు చెందిన పిల్లుట్ల రమేష్, కార్యదర్శిగా ముకుందంలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు లాంఛనంగా ప్రకటించి వారికి శుభాభినందనలు తెలిపారు.

## నిర్మలానందంకి 'ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్'

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు సాగి కమలాకరశర్మ పర్యవేక్షణలో 'సాహితీ మేళల సంస్థ సాహిత్యసేవ' అనే అంశంపై పరిశోధనలు చేసి సమర్పించినందుకుగాను ఇడి కూడ నిర్మలానందం 'ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్'ను ప్రకటించింది. 2018 గురుకుల జీజీటీగా, 2019లో గురుకుల జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగాలను సాధించిన నిర్మలానందం ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తెలుగువెలుగు ఫౌండేషన్ ఉగాది పురస్కారం, సర్దార్ వల్లభాయ్‌పటేల్ జాతీయ పురస్కారాన్ని, విశ్వకర్మ పీఠం(గుంటూరు) వారి విశ్వకర్మ విద్యాభూషణ్' పురస్కారాలను పొందారు. కాగా 21న డాక్టరేట్ పొందిన నిర్మలానందకు సత్కరించబోతున్నారు.

## చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన సతీష్

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ కొత్త ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సతీష్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నానునాయక్‌ను కాతాపత్తర్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. 2004 బ్యాచ్‌కు చెందిన సతీష్ మొదటి మారెడ్‌పల్లి ఎస్ఐగా అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లాలో నగర టూ టౌన్‌ఎస్ఐగా కామారెడ్డి, చౌటుప్పల్ రూరల్, మీర్‌చౌక్, సైబర్‌క్రైంలో విధులు నిర్వహించిన అనంతరం సిఐగా పదోన్నతిపై అఫ్జల్‌గంజ్ డిఐగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం బదిలీల్లో భాగంగా చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక దృష్టిని సారిస్తానని, ప్రధానంగా ఆర్టీసి క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి ప్రాంతాలలో ట్రాఫిక్ చిక్కులు అధిగమించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు.

## హిమాయత్‌నగర్ డివిజన్‌లో పర్యటించిన కార్పొరేటర్



పార్కులో ప్రముఖులతో మాట్లాడుతున్న మహాలక్ష్మీ రామన్‌గౌడ్

**హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్ డివిజన్‌లోని ఆయిల్ సీడ్స్ కాలనీలో సోమవారం కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడే ఉన్న పార్కును ఆమె సందర్శించారు. పార్కును ఆధునీకరించాలని గత ఏడాది క్రితం అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని ఆమె చెప్పారు. పార్కులో రెండు లక్షల రూపాయల విలువగల పనులను ఆమె వాడుకలోకి తీసుకువచ్చారు. పార్కులో వాకర్స్ ట్రాక్, సీనియర్ సిటజన్స్ కుర్చోవడానికి బెంచ్‌లు ఏర్పాటు చేయడం, పిల్లలు వాడుకోవడానికి క్రీడా వసతులు, పరికరాలను ఏర్పాటు చేసి కాలనీలోని ప్రముఖులతో పార్కులో పర్యవేక్షించడం జరిగింది.

## సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ : గాలి వినోద్‌కుమార్

**తార్నాక, మే 22 ప్రభాతవార్త:** అణగారిన వర్గాలు,మహిళల హక్కుల కోసం సంఘసంస్కర్త భాగ్యరెడ్డివర్మ ఎనలేని సేవందించారని ఓ.యూ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొ.గాలివినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఓ.యూలోని తన కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకల సందర్భంగా ప్రొ.గాలివినోద్‌కుమార్ భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత జాతీ అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషిని ఆయన స్మరించుకున్నారు. బ్రాహ్మణులు హిందువులు కాదని బహుజనులే ఆది హిందువులని ఆనాడే భాగ్యరెడ్డి వర్మ పేర్కొనడం జరిగిందన్నారు. బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఈ విషయాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి ఆరోపణల్లో నిజం లేదు: కొలన్ గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి

**నిజాంపేట్, మే22 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేక మాజీ ఎమ్మెల్యే, బీజేపి రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని నిజాంపేట్ మేయర్ నీలాగోపాల్ రెడ్డి భర్త కొలన్ గోపాల్‌రెడ్డి మండిపడ్డారు. నిజాంపేట్ రాఘవరెడ్డి గార్డెన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కొలన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశ పెట్టిన జీవో నెంబర్ 58,59 కింద బినామీ పేర్లతో ధరఖాస్తులు చేయించినట్లు ఆరోపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మాటల్లో ఎలాంటి వాస్తవం లేదని ఖండించారు. అంతే కాకుండా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, తాను రూ.2వేల కోట్ల కుంభకోణం చేశారని ఆరోపిణలు చేయడం సిగ్గు చేటన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడక ముందు కూన శ్రీశైలంగౌడ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రభుత్వ భూములు ఏ విధంగా మాయం అయ్యాయో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని 70 ఎకరాల ప్రభుత్వ స్థలాలను ప్రజా అవసరాలకే కేటాయించామని, వాటిలో క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లు, నర్సరీలు, కమ్యూనిటీ హాళ్ళు, నాన్‌వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేశామన్నారు. తమపై,ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలపై కూన శ్రీశైలంగౌడ్ అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, తగిన సమయంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

## కౌన్సిల్ ఫర్ సిటిజన్స్ రైట్స్ మరో ముందడుగు





సిటిజన్స్ రైట్స్ బ్యానర్‌తో సీసీఆర్ సభ్యులు

**జీడిమెట్ల, మే 22 ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం రికార్డులు తనిఖీలు చేసుకొనుటకు, పరిశీలించుటకు, ఫోటోలు వీడియోలు తీసుకొనుటకు తేదీని కేటాయించాలని జిల్లా ఎడ్యుకేషన్ అధికారికి మేడ్చల్ జిల్లా కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు సోమవారం ధరఖాస్తును అందజేశారు. ఈ ధరఖాస్తులో జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్, అంగన్‌వాడీ, కేంద్ర పాఠశాలల విస్తీర్ణం,రెవెన్యూ మ్యాప్, ఆయా పాఠశాలలకు కేటాయించిన సర్వే నెంబర్లు,చిరునామాలు పిన్‌కోడ్స్‌తో సహ రికార్డుల్లో చూపగలరని సీసీఆర్‌సభ్యులు కోరారు. కార్యక్రమంలో సీసీఆర్ సభ్యులు సుబ్రహ్మణ్యం, ప్రసాద్, మాధవరెడ్డి, సురేష్, రవి, హనుమంతరెడ్డి, నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : శ్యామ్‌కుమార్



కంటోన్మెంట్ బోర్డు సిఈఓకు వినతిపత్రాన్ని అందించిన శ్యామ్‌కుమార్

**తిరుమలగిరి, 22 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్ సమస్యలపై బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రాని అందజేశారు. వార్డులో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించాలని సిఈఓను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు యశ్వంత్ కుమార్, బిసిసెల్ అధ్యక్షుడు విజయ్ కుమార్, సీనియర్ నాయకులు చిన్నా, జాన్, పాండు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వస్త్రాల వ్యాపారులు

**చార్మినార్, మే 22 ప్రభాతవార్త :** చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.కోటయ్యను సోమవారం ది హైదరాబాద్ కట్ పీస్ క్లాథ్ మర్చంట్స్ సోసియేషన్ ప్రతి నిధులు ఎం.సునీల్ కుమార్,టి.సునీల్ కుమార్,అనిల్ శర్మ,తరుణ్ తుల్సియాన్‌లు కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువ కప్పి సన్మానించారు.పలువురు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పోరేటర్ పద్మ

## రూ. 10 లక్షలతో సిసి రోడ్డు పని ప్రారంభం

**హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త:** బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని చెంచుబస్తీలో పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను సోమవారం అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన ఆదివారం రాత్రి కురిసిన వర్షం ప్రభావానికి గురైన శాంతినగర్, బతుకమ్మ కుంట, మల్లన్నగుడి, ప్రాంతాలలో పర్యటించి దెబ్బతిన్న రోడ్లు, చెట్లు, విద్యుత్ స్తంబాల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు తాము అండగా ఉంటామని భయపడవద్దని భరోసా ఇచ్చారు. మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇటీవల ప్రమాదానికి గురై కోలుకుంటున్న పార్టీ నాయకుడు తాండూరి యాదాద్రి నివాసానికి వెళ్ళి ఆయన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్దితిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సహాయం కావాలన్న చేస్తానని యాదాద్రికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## హజ్ యాత్రికుల కోసం స్క్రీనింగ్ టెస్ట్ ప్రారంభం

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** హజ్ యాత్రకు వెళ్ళే భక్తుల కోసం కింగ్‌కోఠిలోని జిల్లా ఆసుపత్రిలో స్క్రీనింగ్ టెస్టును, వ్యాక్సిన్ క్యాంప్‌ను సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రాజేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ క్యాంప్ నేటి నుంచి ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జి.సాధన, హెచ్ఓడి డాక్టర్ రాజశేఖర్‌బాబు, ఎస్‌పిహెచ్ఓ డాక్టర్ పద్మజా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి, కార్పొరేటర్ సురేఖ పాల్గొన్నారు. ఈ అవకాశాన్ని యాత్రికులు సద్వినియోగం సూపరిటెండెంట్ సూచించారు. ఈ మేరకు ఉదయం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు హజ్‌భవన్‌లో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలి

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** దేశంలో రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కారించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపించారు. బిజెపి అధికారంలోకి వస్తే ఏడాదికి ఒక కోటి ఉద్యోగాలు ఇస్తామని నాడు ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోదీ ప్రకటించారని, అధికారంలోకి వచ్చి 9 ఏళ్ళు గడిచినా తరువాత ఉద్యోగాలు, ఉపాధి కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తీసివేసేందుకు ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటు పరం చేశారని,ఉద్యోగులను తగ్గించేందుకు బ్యాంకులను విలీనం చేశారని ఆయన విమర్శించారు. విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య దేశంలో లక్షల కొద్ది పెరిగిపోతున్నదని, ఉపాధి, ఉద్యోగాలు లేక అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## జీవో 59 ప్రకారం ఖాళీ స్థలాలను అర్హులందరికి రిజిస్ట్రేషన్‌కు వినతి



హిమాయత్‌నగర్ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** జవహర్‌నగర్ ఎస్సార్టీ, టిఆర్టీ క్వార్టర్స్‌లో ఖాళీ స్థలాలను జీవో 59 ప్రకారం అర్హులందరికీ వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని హిమాయత్‌నగర్ తహసీల్దార్ ఎస్‌పిఆర్ మల్లేష్‌కుమార్‌ను కోరారు. జవహర్‌నగర్ ఎస్సార్టీ, టిఆర్టీ కాలనీవాసులు మారిశెట్టి నర్సింగరావు, నర్మెట్ట మల్లేష్, రమేశ్ గాంధీ, దేవయ్య, ఆకాశ్, దేవిలాల్, సాయిలు తదితరులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా నివాసముంటున్న 200 మంది లబ్ధిదారులు తమ క్వార్టర్స్ ముందు ఖాళీ స్థలాలను, ఇండ్లను నిర్మించుకున్న స్థలాలను జీవో 59 ప్రకారం తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. కార్మికుల కుటుంబాల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన 59 జీవో ప్రకారం స్థలాలను కల్లు కట్టకుండా వారికి 25శాతం ధరతో, ఖాళీ స్థలాలను 100శాతం ధరతో రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. ఈ విషయంపై తాము ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నామని, తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓ, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో పాటు కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రాలను అందించడం జరిగిందన్నారు. తహశీల్దార్ మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ జీవో 59 ప్రకారం నిబంధనలను ప్రకారం అర్హులందరికీ జీవో ప్రకారం ఖాళీ స్థలాలు, నిర్మించుకున్న ఇండ్ల స్థలాలను రిజిస్ట్రేషన్‌చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## నిరుద్యోగులను మభ్యపెట్టడానికే జాబ్ మేళాలు: శ్రీశైలంగౌడ్



స్థానికులకు బీజేపి కరపత్రాలను అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

**జీడిమెట్ల, మే 22 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, 60యార్డ్స్, మైత్రినగర్, తెలుగుతల్లి నగర్‌లలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపి రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ పైపులైన్ వేసిన అనంతరం సీసీ రోడ్డువేయకపోవడంతో పైపులైన్ ధ్వంసమైందని, రోడ్డును ఏర్పాటు చేయకపోవడంవల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన శ్రీశైలంగౌడ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజీవ్ గృహకల్ప ఆటో స్టాండ్ వద్ద బీజేపి జెండా ఎగురవేసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సమస్యల వలయంగా తయారైందని, నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకుండా జాబ్ మేళాలు ఏర్పాటు చేసి యువతను ఎమ్మెల్యే వివేకానంద్ మోసం చేస్తున్నాడని విమర్శించాడు. మరోసారి అంటే ముచ్చటగా మూడోసారి ప్రజలను మోసం చేసి బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి మోసపూరిత హామీలతో విశ్వ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పతనమైందని, బీజేపి కమలం వికసిస్తోందని శ్రీశైలంగౌడ్ అన్నారు. కార్యక్రమంలో బీజేపినాయకులు శ్రీరాములు, వాసు, రవి, లక్ష్మీనారాయణ, సాయిరాంరెడ్డి, సందీప్, శ్రీకాంత్, బస్తీవాసులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రూ. 90 24 గంటల డే పాస్ : రాంమోహన్

**కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త:** ఆర్టీసి ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ జెబిఎస్ 279, సికింద్రాబాద్ బ్లూసీ 16 పాయింట్‌లలో డే పాస్, టీఏవైఎల్ 24 గంటల పాస్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రాంమోహన్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఏవైఎల్ డే పాస్ 24 గంటల పాస్ 90 రూపాయలు ఉంటుందన్నారు. ఈ పాస్‌తో సిటీ ఆర్డినరీ, మెట్రో బస్ సర్వీస్‌ల్లో ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ యాకూబ్ రాజా, ఏ.డి.సి.దయాకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## కార్గో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

**కంటోన్మెంట్, మే 22 ప్రభాతవార్త:** టీఎస్ ఆర్టీసి గ్రేటర్‌లోని వివిధ డిపోల్లో కార్గో(ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను నడిపేందుకు ఔట్‌సోర్సింగ్ ద్వారా డ్రైవర్లను ఎంపిక చేసుకుంటున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ సిపిఎం కె.వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ జెబిఎస్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్గో బస్సులను, ఆయా డిపోల్లో పార్కింగ్ విభాగాల్లో పనిచేసేందుకు ఆసక్తిగల డ్రైవర్లు ఈ నెల 31వ తేదీలోపల ఆన్‌లైన్‌లో,నేరుగా కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 9959224433 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

# అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్.. ఇబ్బందుల్లో ప్రజలు

**బేగంబజార్, మే 22 ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వాహనాల రద్దీ వల్ల తరచుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నది. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు నరకయాతనకు గురవుతున్నారు. సరిహద్దుల సాకుతో కోల్సావాడి, రాంనాథ్ ఆశ్రమం, దంత కళాశాల వెనుక వైపు రహదారి, ఇరువైపుల్లా ద్విచక్ర వాహనాలను మొదలుకుని కార్లు, లారీలను అడ్డదిడ ంగా వాహనాలు పార్కింగ్ చేసి ఉంటున్నాయి. ముఖ్యంగా ప్రధాన వ్యాపార వాణిజ్యకేంద్రం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి లారీలలో వచ్చే సరుకులనతోపాటు ట్రాన్స్‌పోర్టు యాజమానులు ఇతర జిల్లాలకు తరలించే సామాగ్రిని సైతం అక్కడ నిలిపి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు. కొన్ని సందర్భాలలో వాహనదారుల మధ్య చిన్న, చిన్న గొడవలు చోటు చేసుకుంటున్నాయి. బేగంబజార్ చత్రి మీదుగా ఎంజె మార్కెట్, నాంపల్లి మీదుగా ప్రయాణం చేస్తున్న ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యనుపరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సుడిగుండంలో చిక్కుకుని తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ధుమ్ము, ధూళిని భరించ లేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు రోడ్డు మీదుగా నడిచి వెళ్లే సమయంలో పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భూలక్ష్మి దేవాలయం నుంచి అప్జల్ గంజ్ వెళ్లే రహదారి కూడా వాహనాలతోపాటు వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసే వారి వాహనాలు రహదారిపై అడ్డదిడ్డంగా పెడుతుంటారు. కాగా పురానాపూల్ నుంచి జియాగూడ రహదారిలో మద్యం దుకాణాలతో వాహనదారులు, పాదాచారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే జాతీయ రహదారి మేకలమండి, నవోదయ గంగానగర్, కమేళా గేటు పక్కనే వెలిసిన బార్‌ల కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తుంది. ఇక్కడి నుంచి ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు రాకపోకలు కొనసాగుతుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

# సర్కిల్ కార్యాలయంలో సెటిల్మెంట్లు

## కార్యాలయంలో దర్శనం ఇవ్వని అధికారులు

**చెయ్యి తడపందే ముందుకు సాగని పనులు - ఎన్ని అర్జీలు పెట్టుకున్న ఫలితం శూన్యం**
**వివిధ పనుల కోసం సర్కిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వైనం**
**చిన్న పనికి కూడా నయానో భయానో ముట్ట చెప్పాల్సిందే**



**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** సర్కిల్ కార్యాలయాల్లో సెటిల్మెంట్ల పర్వం కొనసాగుతూనే ఉంది. మూడుసర్కిల్లో ఏ పని కావాలన్నా చేయి తడపందే పనులు ముందుకు సాగలేకపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వివిధపనుల నిమిత్తం ఎల్బీనగర్,హయాత్‌నగర్, సరూర్‌నగర్, సర్కిల్ పరిధిలోని పలు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రజలు సర్కిల్ కార్యాలయాలకు వస్తే వారి సమస్యలు పట్టించుకునే నాథుడే కరువైయ్యాడని పలువురు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీల నుంచి పనుల కోసం వచ్చేవారికి అధికారులు కూడా తమ సీట్లలో దర్శనం ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్నోసార్లు సర్కిల్ కార్యాలయాల్లో అర్జీలుపెట్టుకున్న అవి బుట్ట దాఖలు అవుతున్నాయే తప్ప పనులు మాత్రం ముందుకు సాగడం లేదని పలువురు అధికారుల తీర్పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేవలం పైరవీకార్లకు మాత్రమే అధికారులు అందుబాటులో ఉంటున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పలు విభాగాల అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని, ఫోన్ చేస్తే ఫీల్డ్ వర్క్ మీద ఉన్నామంటూ సమాధానం ఇస్తున్నారని, మరికొందరు అధికారులు ఫోన్లు కూడా ఎత్తడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే చేతివాటానికి అలవాటు పడ్డ అధికారులు సాయంత్రం ఐదు తర్వాత కార్యాలయాలకు వచ్చి చేతి తడిపిన వారికి మాత్రమే పనులు చేసి పెడుతున్నారని పలువురు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన అధికారులు అందుబాటులో ఉండడం లేదని తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటే కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పారిశుద్ధ్యం, విద్యుత్ విభాగాలకు చెందిన అధికారులు తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాలనీలలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ఎన్నిసార్లు సర్కిల్ కార్యాలయం చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకుండా పోతుందని కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే సమస్యలకు సంబంధించి ఉప కమిషనర్లకు విన్నవించిన చేద్దాం చూద్దాం అంటూ కాలయాపన చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాయంత్రం 5గంటల తర్వాత పైరవీకారులకు మాత్రమే అందుబాటులో ఉంటూ తమను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీవాసులు, పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్న పని చేయాలంటే కూడా నయానో భయానో సమర్పిస్తే కానీ అధికారులు స్పందించే పరిస్థితిలో లేరని పలు పనులకోసం వచ్చేవారు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం పూట దళారులతో కలిసి సెటిల్మెంట్లు చేసుకుంటున్న వారిదే హవా కొనసాగుతుందని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. సర్కిల్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవినీతి అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు ప్రజలు కోరుతున్నారు.

# ఆక్రమార్కుల కబంధ హస్తాల్లో చిక్కుకుని మాయమవుతున్న మాసాబ్‌చెరువు

**కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : మల్‌రెడ్డి రంగారెడ్డి, అఖిలపక్ష నాయకులు**



మాసాబ్ చెరువును సందర్శించిన మల్‌రెడ్డి రంగారెడ్డి, అఖిలపక్ష నాయకులు

**తుర్కయాంజాల్, మే 22 ప్రభాతవార్త :** 495ఎకరాల మాసాబ్‌చెరువు ఆక్రమార్కుల కబంధ హస్తాల్లో చిక్కుకొని మాయం అయిపోతుందని, కాలువలను, తూములను మాయం చేయడంవల్ల స్థానిక గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది. చుట్టుప్రక్కల దాహార్తిని తీర్చే తల్లిలాంటి మాసబ్ చెరువులో కొందరు రియల్టర్స్ అక్రమంగా మాసబ్ చెరువు చుట్టూ మట్టిని వేసి పూడ్చివేస్తున్నారన్నారన్నారు. ఎక్కడ చూసినా కబ్జాకోరులే ఉన్నారని ఆవేదన వ్యక్_ం చేసారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ అఖిలపక్ష నాయకులతో కలిసి టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్‌రెడ్డి రంగారెడ్డి మాసబ్ చెరువును పరిశీలించారు. సోమవారం వారు మాట్లాడుతూ మసాభ్‌చెరువు ఎఫ్‌టిఎల్ లోపల మట్టి పోసిన కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోసిన మట్టిని ఎత్తివేసి, మాసాభ్ చెరువును వెంటనే శాటిలైట్ సర్వే చేసి ఎఫ్‌టిఎల్ హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని మల్‌రెడ్డి రంగారెడ్డి అఖిలపక్ష నాయకులు కౌన్సిలర్లతో కలిసి డిమాండ్ చేశారు. మాసభ్ చెరువు ఎఫ్‌టిఎల్ లోపల మట్టి పోయడాన్ని వ్యతిరేకిస్తూ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అఖిలపక్ష నాయకులతో కలిసి పరిశీలించారు. రియల్ ఎస్టేట్ వాళ్లు వందల కోట్ల రూపాయలు విలువ కలిగిన మాసాభ్ చెరువులో నీళ్ళు ఉండగానే లారీలతో బయటనుంచి మట్టి తీసుకొచ్చి చెరువులో ఎలా నింపుతారని ప్రశ్నించారు. ఎఫ్‌టిఎల్ హద్దురాళ్లు లేకుండా చేసి మట్టిని పోసి నింపడం చట్టరీత్యా నేరమని అన్నారు. చెరువులో నీరు ఉండగా మట్టితో పుడ్చడాన్ని ఖండిస్తున్నామన్నారు. సాగర్ హైవే రోడ్డు ప్రక్కనేఉన్న చెరువును మట్టితో నింపుతుంటే ఇరిగేషన్ అధికారులు, ఆర్‌డిఓ, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఎమ్మార్వో ఏమిచేస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన కనీస భాద్యత లేదా అధికారులకు లేఆ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎందుకు చూస్తూ ఉన్నారని ప్రశ్నించారు. వెంటనే చెరువు కుంటలను శాటిలైట్ ద్వార రీసర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని. జిల్లాలో రియల్ ఎస్టేట్, పట్టణీకరణ, పరిశ్రమలు పేరుతో పెద్ద ఎత్తున కబ్జాదారులు కబ్జాలు చేస్తున్నారని అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి మాసాభ్ చేరువులో పోసిన మట్టిని ఎత్తివేయాలని మట్టి పోసిన వారిపై ల్యాండ్ గ్రామింగ్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని హెచ్చరించారు. లేదంటే అఖిలపక్ష నాయకులతో కలిసి పెద్ద ఎత్తున సాగర్ రహదారిపై ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ అఖిలపక్ష నాయకులు కాకుమాను సునీల్, కోసికె ఐలయ్య, కొంతం యాదిరెడ్డి, రావుల వీరేశం, సత్యనారాయణ, తాళ్లపల్లి మోహన్ గుప్తా, బి.రమేష్, కొండ్రు మల్లేష్, కుంట గోపాల్‌రెడ్డి, మర్రి మాధవిమహేందర్‌రెడ్డి, రేవెల్లి యాదగిరి, బొక్క రవీందర్‌రెడ్డి, నక్క శివ లింగంగౌడ్, మున్సిపాలిటీ కమిషనర్ సాబేర్ అలీ, మధుసూదన్‌రెడ్డి, రొక్కం చంద్రశేఖర్‌రెడ్డి, ఒద్దిగల బాబు, మేతరి దర్శనం, పూజారి శంకరయ్య, సామ భీమిరెడ్డి, బొక్క గౌతంరెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో వేగవంతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్‌లో మంజూరు అయిన అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.32 లక్షలతో శివాజీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, రూ.47 లక్షలతో యువ చైతన్య యూత్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, రూ.25 లక్షలతో న్యూసమతాపురికాలనీ, న్యూనాగోల్ కాలనీల సిసి రోడ్డు, రూ 12 లక్షలతో న్యూనాగోల్ కాలనీ నందు రిస్టోరేషన్ ఆఫ్ యూజీడీ లైన్ ఇతర అభివృద్ధి పనులను వారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆనంతుల రాజారెడ్డి, వజీర్ ప్రకాశ్‌గౌడ్, ఉదయ్ గౌడ్, బిఆర్ఎస్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధురాలికి ఉచితంగా కంటి శస్త్రచికిత్స



వృద్ధురాలికి కంటి పరీక్ష చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** నిరుపేదలకు తాము అండగా నిలుస్తామని యోజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ బస్తీ నివాసి జిజీ బాయ్ అనే 77సంవత్సరాల వృద్ధమహిళకు కంటిచూపు లేక ఇబ్బంది పడుతోంది. స్థానిక నాయకులద్వారా సమాచారం తెలుసుకున్న రాష్ట్ర చిలుక ఉపేందర్‌రెడ్డి వృద్ధురాలికి నేత్రాలయ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తనవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్‌యాదవ్, రాజునాయక్, సలీం, ప్రేమ్ నాయక్, పింటూ, భాస్కర్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత్‌నగర్‌లో పర్యావరణ పరిరక్షణ, మిషన్ లైఫ్‌పై అవగాహన

**సరూర్‌నగర్ 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ ప్రశాంత్‌నగర్ ఫేజ్-1 అంగన్‌వాడి కేంద్రంలో సోమవారం పర్యావరణపరిరక్షణ, మిషన్‌లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన, ఇంకుడు గుంతల అవసరం, సురక్షిత నీటి వాడకం, కిచన్ గార్డెన్‌కు సంబంధించిన తులసి, మెంతికూర, పుదీన, కరివేపా వాడాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక వాటర్ ట్యాంకులను, తాగు నీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ భీమ్‌రాజ్, ఐడిడిఎస్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, అంగన్‌వాడి టీచర్ సంగీత, హెల్పర్ శ్వేత, ఎఎల్ఎంఎస్‌డి కమిటీ అధ్యక్షురాలు పద్మతో పాటు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కట్టడికి ట్రిపుల్ ఆర్ సూత్రాన్ని పాటిద్దాం : మానస

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** ప్లాస్టిక్ కట్టడికి ట్రిపుల్ ఆర్ సూత్రాన్ని పాటించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిహెచ్ఎంసి ఎన్విరాన్మెంట్ స్పెషలిస్ట్ మానస పేర్కొన్నారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం (వరల్డ్ బయో డైవర్సిటి డే)సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులతో ట్రిపుల్ ఆర్ (రిడ్యూస్, రియూస్, రిసైకిల్) పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విఘాతంగా మారుతున్న ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉందామన్నారు. తప్పని సరి వాడాల్సివస్తే తక్కువగా వాడుదాం, అది క్షీణదశకు చేరేవరకు మళ్ళీ మళ్ళీ ఉపయోగిద్దాం క్షీణదశలో కరిగించి మరల కొత్త వస్తువుగా మార్చి వాడాలని, ఎట్టి పరిస్థితుల్లో భూమిపై, మురుగు నాలాల్లో పడవేయవద్దని సూచిం చారు. ఈ కార్యక్రమంలో సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సిఇఓ టి.సురేందర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల బాగుకోసం పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ, సహజవనరుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరం బాధ్యతగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజ్ ఇంచార్జ్ రవీన్, వైస్‌ప్రిన్సిపాల్ ఝాన్సీ, శ్రీధర్, యాదగిరి, అంజయ్య పాల్గొన్నారు.

## రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** మనం తినే అన్నం ముద్దులో ఓ మెతుకు సహాయం చేయడమే రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఉద్దేశమని సినీ నటుడు జూనియర్ పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. అఫ్జల్‌గంజ్ ఉస్మానియా జనరల్ ఆస్పత్రివద్ద అనాథలకు, రోగుల సహాయకులకు రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సినీ ఆర్టిస్టులు బలగం మూవీ సహదేవు, వంశీ పల్లె ప్యాషన్ షో డైరెక్టర్ శివకార్తీక్, లజ్జ నటుడు జూనియర్ పవన్‌కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జూనియర్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రెడీ టు సర్వే ఫౌండేషన్ ప్రతి ఆదివారం ఒక్కో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గత పది సంవత్సరాలుగా అనాథలకు, రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు శివ నేత తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌మాన్షన్ సమ్మర్ ప్యాలెస్ పురాతన భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బలాల



పురాతన భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, మే 22 ప్రభాతవార్త :** మహబూబ్‌మాన్షన్ సమ్మర్ ప్యాలెస్ పురాతన భవనాన్ని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఛైర్మన్ వేదకుమార్, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణలతో కలిసి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన భవనం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పురాతన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం జరిగిందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాలం షాహిద్, నాయకులు సైపుద్దీన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలకు డిమాండ్ : గజ్జి భాస్కర్



అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న భాస్కర్

**హయత్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** హయత్ నగర్ మండల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 88,89,147లో గల 3.38ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమిని కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ కార్యదర్శి గజ్జిభాస్కర్ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు భూమిలో గతంలో చిన్నదర్గా ఉండేదని, ముస్లీం సోదరులు అందులో మసీదు నిర్మాణం చేస్తుంటే దానిని కబ్జాచేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారిని బెదిరిస్తున్నా రని తెలిపారు. ఆ భూమిని ప్లాట్లుగా చూపుతూ పేదలకు వాటిని విక్రయిస్తూ కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని వివరించారు. దీనిపై పూర్తి విచారణ జరిపి కబ్జాకారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వక్ఫ్ బోర్డు భూమిని కాపాడాలని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు.

## స్వచ్ఛ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలి

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** కొత్తపేట డివిజన్‌ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తయారు చేయడమే ప్రధాన లక్ష్యమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. సత్యనగర్ పార్క్‌లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో రెడ్యూస్ రైస్ రీసైకిల్ మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షేహర్ కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో ఉన్నటువంటి ప్లాస్టిక్ బాటిల్లు, కవర్లు, పుస్తకాలు, పేపర్లు తీసుకువచ్చి ఒక దగ్గర ఏర్పాటు చేసి వెంటనే వాటిని రీసైకిల్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కొత్తపేట డివిజన్‌ను స్వచ్ఛ డివిజన్‌గా ఏర్పాటు చేయడమే ప్రధాన లక్ష్యంగా చెత్త రోడ్లపై వేయకుండా స్వచ్ఛందంగా శుభ్రంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రమాణం చేశారు. అంచలంచలుగా డివిజన్ క్లీన్ అండ్ గ్రీన్‌గా తయారు చేస్తామని అన్నారు.

## ప్రేమ భావంతోనే శాంతి : ఎమ్మెల్యే దేవిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** ప్రేమ భావం సమానత్వం ద్వారానే దేశంలో శాంతినెలకొంటుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్బీనగర్ పాస్టర్స్ క్రిస్టియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జాకబ్ అధ్యక్షతన క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమే శాంతికి మూలమని క్రీస్తు అటువంటి ప్రేమనే పంచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. ఎమ్మెల్సీ రాజేశ్వరరావు మాట్లాడుతూ క్రైస్తవులంతా ఐక్యంగా ఉంటూ తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు ప్రభువును ప్రేమతో ఆరాధిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రెవరెండ్ ఎం. దయానంద్, ఏసుపాదం, జాకాబ్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## పాడైన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రికి కృతజ్ఞతలు

**సరూర్‌నగర్ 22 ప్రభాతవార్త:** ట్రంక్‌లైన్, బాక్స్ కల్వర్టు పనుల వల్ల పాడైన మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ఎంఎల్‌ఆర్ కాలనీ, ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ ప్రధాన రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలను మంజూరు చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. పాడైన రోడ్ల విషయమై కాలనీల ప్రజలు సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తేవడంతో స్పందించిన ఆమె నిధులు మంజూరు చేశారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ కమాన్ నుండి ఎంఎల్ఆర్‌కాలనీ రోడ్ నెంబర్ 3లోని రేషన్ షాపు వరకు రోడ్డు నిర్మాణానికి మంత్రి చర్యలు తీసుకోవడంపై భూపేష్‌గౌడ్‌తో పాటు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

## ముదిరాజ్‌ల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి : కార్పోరేటర్ గీత ప్రవీణ్



ఫిషరీస్ చైర్మన్ రవీందర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న కార్పోరేటర్ గీత

**నాచారం, మే 22 ప్రభాతవార్త:** సీఎం కేసీఆర్ ముదిరాజ్ సామాజిక వర్గానికి అనేత అవకాశాలు కల్పిస్తున్నారని చిల్కానగర్ కార్పోరేటర్ గీత ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పిట్టల రవీందర్‌ను కార్పోరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. సీఎం ముదిరాజ్‌ల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వారలక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

## హైద్రాబాద్ నగరానికి దిక్సూచి ఎల్‌బినగర్ : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బాక్స్ డ్రెయిన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, మే 22 ప్రభాతవార్త :** అభివృద్ధి విషయంలో ఎల్‌బినగర్‌ను హైద్రాబాద్‌కు దిక్సూచిలా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ ఉదయ్‌నగర్. ఎంఆర్‌ఆర్ కాలనీ, పవన్‌పురి కాలనీ, సూర్యనగర్‌లో పర్యటించి బాక్స్ డ్రెయిన్ పనులు పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎస్ఎన్‌డిపి పనులు చేపడుతున్నామని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఎస్ఎన్‌డిపి పనులు చేపట్టే సమయంలో స్థానికుల అనుమానాలు, సందేహాలు నివృత్తి చేస్తూ అనేక అవరోధాలను అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలో చేపడుతున్న 13 కిలోమీటర్ల ఎస్ఎన్‌డిపి పనుల్లో ఇప్పటికే 9కిలోమీటర్లు పూర్తిచేయడం జరిగిందన్నారు. స్వార్ధపూరిత రాజకీయాలు చేస్తున్న కొందరు నాయకులు అభివృద్ధి పనులకు అడ్డుతగులుతూ ఓట్ల కోసం చెప్పే రెచ్చగొట్టే మాటలను వినవద్దని ఆయన ప్రజలను కోరారు. ఏపని చేయనివారు కూడా తాము చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూస్తున్నారని దీన్ని ప్రజలందరు గమనించాలన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనుల విషయంలో కొన్ని కఠిననిర్ణయాలు తీసుకోవడం జరిగిందని, ప్రజలందరు అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఎల్‌బినగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉంచాలన్న తపనతో పనిచేస్తున్నామని, ప్రజలందరు తమ సహకారాన్ని అందించాలని కోరారు. ఎస్ఎన్‌డిపి ప్రాజెక్ట్ ఇఇ కృష్ణయ్య మాట్లాడుతూ ఎల్‌బినగర్‌లో రూ.113 కోట్లతో 10పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఉదయ్‌కిరణ్, సరిత, బిఆర్ఎస్ నాయకులు నల్ల రఘుమారెడ్డి, ఓరుగంటి వెంకటేష ం, సుంకోజు కృష్ణమాచారి, చీర శ్రీనివాస్, ముద్ద కళ్యాణ్, కాలనీ వాసులు నర్సింహా, నర్సింహారెడ్డి, దుర్గారెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## దళిత బంధు అక్రమాలపై ప్రశ్నించిన న్యాయవాదిపై దాడి చేసిన బిఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలి: బిఎస్‌పి



న్యాయవాదిపై దాడి ఘటనను ఖండిస్తున్న గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్ 22 ప్రభాతవార్త:** దళిత బంధు పథకం అమలులో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించిన న్యాయవాదిపై అమానుషంగా దాడి చేసిన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ అనుచరులైన బిఆర్ఎస్ గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద దళితులకు అన్యాయం చేసే విధంగా తుంగతుర్తిలో దళిత బంధు పథకంలో కమీషన్లు దండుకొంటున్నారని స్థానికఎదైన న్యాయవాది యుగేందర్ నిలదీస్తే ఎమ్మెల్యే అనుచరులు అమానుషంగా ఆయనను కారునుండి లాగి రాడ్లు, కట్టెలతో దాడి చేశారని ఆయన సోమవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోపించారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన న్యాయవాదికి మెరుగైన చికిత్సను అందించి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే కిశోర్‌ను బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు పాల్గొన్నారు.

## గడ్డిఅన్నారం బీజేవైఎం అధ్యక్షునిగా శివరాం

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** గడ్డిఅన్నారం డివిజన్ బీజేవైఎం అధ్యక్షునిగా మొగిలి శివరాం నియామకమయ్యారు. ఈ మేరకు గడ్డిఅన్నారం డివిజన్ బిజెపి అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ నియామక పత్రాన్ని సోమవారం శివరాంకు అందజేశారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ పార్టీ నియమ నిబంధనలను పాటిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్ ప్రేమ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు నీలా ఆనంద్‌కుమార్, దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, శ్రవణ్, సీనియర్ నాయకుల సలహాలు సూచనలతో కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు.

## విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

**మలక్‌పేట, మే 22 ప్రభాతవార్త :** విద్యార్థులు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని దిల్‌సుక్‌నగర్ అనిబిసెంట్ మహిళా కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అమ్మాయిలు మంచి విద్య, జ్ఞానాన్ని కలిగి ఉండడంవల్ల ఆర్థిక స్వాతంత్ర్యం సాధ్యపడుతుందన్నారు. అనిబిసెంట్ కళాశాలకు విద్యారంగంలో మంచి పేరు ఉందని, ఇది నిష్ణాతులైన అధ్యాపకులవల్లే సాధ్యపడిందని, తమ విద్యార్థులు మంచి సభ్యత, సంస్కారాన్ని కలిగి ఉన్నారని అన్నారు. తమ కళాశాల పూర్వ విద్యార్థులు ఉన్నత రంగాల్లో ఉన్నారని, 50 శాతం మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రపంచం చాలా కూడుకున్నదని, దానిని ఎదుర్కోవడానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అదే విధంగా స్పోర్ట్స్ డే లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ లైన్ పనులు పూర్తి చేయాలి: అరుణ

**ఎల్.బి.నగర్, మే 22 ప్రభాతవార్త :** బాక్స్ లైన్ పనులను వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్‌లోని కేతన్ ఎంక్లేవ్ కాలనీలో బాక్స్ లైన్ (డ్రైనేజీ) పనులను హయత్‌నగర్ ఉపకమిషనర్ మారుతిదివాకర్‌తో కలిసి సోమవారం అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని బాక్స్‌లైన్, సిసి రోడ్లు పనులు వెంటనే పూర్తి చేయాలని, కాలనీవాసులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.